# నిజం చెపుతాం
Nijam Cheputham
తెలుగు దినపత్రిక

సూర్యాపేట | శనివారం | 22-02-2025 | ఎడిటర్: కామళ్ల కాంతయ్య | సంపుటి: 4 | సంచిక: 10 | పేజీలు: 4 | వెల: రూ.1/-


### మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలి

హైదరాబాద్‌లోని శిల్పారామం వద్ద మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించుకోవడానికి ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. దీనిని మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తొలుత ప్రతి జిల్లాలో ఒకచోట ప్రభుత్వ భూముల్లో మహిళా సమాఖ్యలకు పెట్రోల్ బంకులను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

### గ్రూప్-2 అభ్యర్థుల పరిస్థితిని పట్టించుకోరా?

గ్రూప్-2 మెయిన్స్ అభ్యర్థుల ఆందోళనలపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పందించారు. గ్రూప్-2 అభ్యర్థులతో చంద్రబాబు ప్రభుత్వం చర్చించాలని డిమాండ్ చేశారు. 2023 డిసెంబరు 11వ తేదీన ఇచ్చిన నోటిఫికేషన్ రోస్టర్ విధానంలో తప్పులు ఉన్నాయని గ్రూప్-2 మెయిన్స్ అభ్యర్థులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు



## కిషన్ రెడ్డి, బండి సంజయ్
# చర్చకు సిద్ధమా...

**మోదీ 12 ఏళ్ల పాలన.. మా 12 నెలల పాలనపై చర్చకు సిద్ధమా**

**- రూ.15 లక్షలు పంచుతామన్న మోదీ ఒక్కరికైనా ఇచ్చారా అని నిలదీత**

**- పన్నెండేళ్లలో 24 కోట్ల ఉద్యోగాలు వచ్చాయా**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

హైదరాబాద్,ఫిబ్రవరి21 ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలన, తెలంగాణలో కాంగ్రెస్ 12 నెలల పాలనపై కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ చర్చకు సిద్ధమా? అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ చేశారు. ఏ సెంటర్ అయినా, ఎప్పుడైనా, తాను, దామోదర రాజనర్సింహ వస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో, లోక్ సభ ఎన్నికల సమయంలో మోదీ ఇచ్చిన హామీలపై చర్చించుదామని ఆయన అన్నారు.అధికారంలోకి వస్తే విదేశాల్లోని నల్లధనం తీసుకొచ్చి దేశంలోని పేదలకు పంచుతానని నరేంద్ర మోదీ అధికారంలోకి రాకముందు చెప్పారని, కానీ ఇప్పటి వరకు ఒక్కరి ఖాతాలలో అయినా వేశారా అని నిలదీశారు. పైగా నల్లధనం ఉన్నవారు మన దేశం విడిచి వెళ్లిపోయారని అన్నారు. విదేశాల్లోని నల్లధనం తెచ్చింది లేదు... పేదలకు ఇచ్చింది లేదని విమర్శించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోదీ చెప్పారని, ఈ పన్నెండేళ్లలో 24 కోట్ల ఉద్యోగాలు వచ్చాయా? అని ప్రశ్నించారు.మోదీ, బీజేపీ ఇచ్చిన హామీలపై చర్చకు ప్రధాన మంత్రి బంట్రోతులు వస్తారా లేక ఆయనే లెక్క చెబుతారా? అని నిలదీశారు. తెలంగాణలో కేసీఆర్ ఒక రకంగా మోసం చేస్తే, ప్రధాని నరేంద్ర మోదీ మరో రకంగా చేశారని ఆరోపించారు. తెలంగాణ ప్రజలకు వాస్తవాలు చెప్పేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందని ఆయన అన్నారు. కొడంగల్‌లో ప్రాజెక్టులు తెచ్చి నిరుద్యోగ సమస్యను పరిష్కరించుకుందామని అన్నారు.



## భాషల మధ్య ఎలాంటి శత్రుత్వం లేదు..

**- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ**

న్యూఢిల్లీ: జాతీయ విద్యా విధానం కింద హిందీని బలవంతంగా రుద్దే ప్రయత్నం జరుగుతోందంటూ తమిళనాడు ప్రభుత్వం, కేంద్రం మధ్య మాటల యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. భారతీయ భాషల మధ్య ఎలాంటి శత్రుత్వం లేదని, ప్రతి భాష ఒకదానినొకటి సుసంపన్నం చేసిందని అన్నారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో శుక్రవారంనాడు జరిగిన 98వ అఖిల భారతీయ మరాఠీ సాహిత్య సమ్మేళనలో ప్రధాని మాట్లాడుతూ, భారత భాషల మధ్య ఎప్పుడూ శత్రుత్వం లేదని స్పష్టం చేశారు. "భారతీయ భాషలన్నీ ఒకదానికొకటి సుసంపన్నం చేసుకున్నాయి. భాషా ప్రాతిపదికగ విభజనలు తెచ్చే ప్రయత్నాలు జరిగినా భారతదేశ ఉమ్మడి భాషా వారసత్వం తగిన సమాధానం ఇచ్చింది. ఇలాంటి అపోహలకు దూరంగా ఉంటూ అన్ని భాషల సమున్నతికి పాటుపడటం ఒక సామాజిక బాధ్యతగా మనమంతా గుర్తించాలి.

## కేటీఆర్‌పై కేసు నమోదు చేసిన
# బంజారాహిల్స్ పోలీసులు

**- రేవంత్ రెడ్డిపై ఆరోపణలు చేశారని కాంగ్రెస్ కార్యకర్త ఫిర్యాదు - బాణసంచా కాల్చారంటూ ముషీరాబాద్‌లో మరో కేసు - కేసులు కొట్టివేయాలంటూ వేర్వేరు పిటిషన్లు దాఖలు చేసిన కేటీఆర్**

హైదరాబాద్,ఫిబ్రవరి21 ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిను తాను అవమానించలేదంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైకోర్టులో పిటిషన్ వేశారు. తన వ్యాఖ్యలతో రాష్ట్రంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగలేదని పేర్కొన్నారు. తన వ్యాఖ్యల వెనుక ఎలాంటి దురుద్దేశం లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అవమానించారంటూ కాంగ్రెస్ కార్యకర్త చేసిన ఫిర్యాదుతో బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.బిల్డర్లు, కాంట్రాక్టర్ల వద్ద ముఖ్యమంత్రి రూ.2,500 కోట్లు తీసుకున్నట్లు కేటీఆర్ ఆరోపణలు చేశారని కాంగ్రెస్ కార్యకర్త ఫిర్యాదు చేశారు.ఎన్నికల ప్రచారంలో బాణసంచా కాల్చినందుకు ముషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేటీఆర్, ఆ పార్టీ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌పై పోలీసులు మరో కేసు నమోదు చేశారు.ఈ రెండు కేసులను కొట్టివేయాలని కేటీఆర్ హైకోర్టులో రెండు వేర్వేరు పిటిషన్లను దాఖలు చేశారు.



## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

**- నారాయణపేట జిల్లాలో రేవంత్ పర్యటన**
**- అప్పక్ పల్లిలో మహిళా సమాఖ్య పెట్రోల్ బంకు ప్రారంభోత్సవానికి హాజరు**
**- రేవంత్ రెడ్డితో పాటు పాల్గొన్న బీజేపీ ఎంపీ డీకే అరుణ**



హైదరాబాద్,ఫిబ్రవరి21 సీఎం రేవంత్ రెడ్డి నేడు నారాయణపేట జిల్లాలో పర్యటించారు. అప్పక్ పల్లిలో మహిళా సమాఖ్య పెట్రోల్ బంకును ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య సభ్యులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసక్తికర దృశ్యం చోటుచేసుకుంది. ఒకే వేదికపై సీఎం రేవంత్ రెడ్డి, బీజేపీ ఎంపీ డీకే అరుణ కనిపించారు. రేవంత్ రెడ్డిపై డీకే అరుణ పలు సందర్భాల్లో విమర్శలు చేస్తుండడం తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఇద్దరూ ఒకే వేదికను పంచుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇక, రేవంత్ రెడ్డి, డీకే అరుణ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమంలోనూ పాల్గొన్నారు. ఈ పర్యటన సందర్భంగా పలుమార్లు రేవంత్, డీకే అరుణ నవ్వుతూ మాట్లాడుకోవడం కనిపించింది.

## పోలేపల్లిలోని రేణుకా ఎల్లమ్మ అమ్మవారిని
# దర్శించుకున్న సీఎం రేవంత్ రెడ్డి

- వికారాబాద్ జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన
- రేణుకా ఎల్లమ్మ ఆలయ సందర్శన
- రేవంత్ రెడ్డికి అమ్మవారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించిన ఆలయ వర్గాలు

వికారాబాద్ ఫిబ్రవరి21 తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు వికారాబాద్ జిల్లాలో పర్యటించారు. దుద్యాల మండలం పోలేపల్లిలోని రేణుకా ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఎల్లమ్మ తల్లికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రస్తుతం పోలేపల్లిలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. కాగా, ముఖ్యమంత్రికి ఆలయ వర్గాలు ఎల్లమ్మ తల్లి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు పొంగులేటి, జూపల్లి, దామోదర రాజనర్సింహ తదితరులు కూడా పాల్గొన్నారు.



## మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వం లక్ష్యం

- ఆడపడుచు వస్తే ఎలాంటి చీర పెడతామో అలాంటి నాణ్యత కలిగిన చీర ఇస్తామన్న సీఎం
- మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలన్న ముఖ్యమంత్రి

మహిళా సమాఖ్య సభ్యులకు ఇక నుంచి ప్రతి ఏటా రెండు చీరలు ఇస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో పిట్టలను బెదిరించేందుకు పంట పొలాల చుట్టూ కట్టే నాణ్యతలేని చీరలు ఇచ్చారని, కానీ ఇప్పుడు సొంత ఆడపడుచు పండుగపూట ఇంటికి వస్తే ఎలాంటి మంచి చీరను పెడతామో అలాంటి నాణ్యతతో కూడిన చీరలను ఇస్తామని ఆయన తెలిపారు. నారాయణపేట జిల్లాలోని అప్పక్‌పల్లిలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకును ముఖ్యమంత్రి ప్రారంభించారు.



## ఏపీ దోపిడీతో తెలంగాణలో
# నీటికి కటకట


**- చంద్రబాబు, రేవంత్, కాంగ్రెస్, బీజేపీల వల్ల తెలంగాణకు ద్రోహం జరిగిందన్న జగదీశ్ రెడ్డి - కేసీఆర్ ను విమర్శించేందుకు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కి సిగ్గుండాలని వ్యాఖ్య**

హైదరాబాద్,ఫిబ్రవరి21 తెలంగాణకు జరిగిన ద్రోహానికి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన శిష్యుడు రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్, బీజేపీలు బాధ్యులని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి అన్నారు. నీటి వాటాల విషయంలో రేవంత్ ప్రభుత్వానికి కనీస సోయి కూడా లేదని మండిపడ్డారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల్లో వాటాకు మించిన నీళ్లను ఏపీ తీసుకెళుతోందని చెప్పారు. సాగర్ ఎడమ కాలువ కింద సాగు, తాగునీటికి ఇబ్బంది పడే పరిస్థితి తలెత్తిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ దోపిడీతో తెలంగాణలో నీటికి కటకట ఏర్పడే పరిస్థితి నెలకొందని అన్నారు.కృష్ణా నీళ్ల దోపిడీ జరుగుతోందని, అడ్డుకోవాలని హరీశ్ రావు సలహా ఇస్తే... కాంగ్రెస్ నేతలు ఎదురుదాడి చేస్తున్నారని మండిపడ్డారు.

## ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై
# కేసులు పెడుతున్నారు

**- పోలీస్ ఉన్నతాధికారులు కూడా రేవంత్ అడుగులకు మడుగులొత్తుతున్నారని మండిపాటు**

**- చిన్న చిన్న అంశాల్లో కూడా హరీశ్ పై కేసులు నమోదు చేస్తున్నారని విమర్శ- బీఆర్ఎస్ కీలక నేత హరీశ్ రావుపై కక్షగట్టి...**
**- ఎగవేతల రేవంత్ రెడ్డి అన్నందుకు మానకొండూరులో కేసు పెట్టారు- రేవంత్ మాదిరి హరీశ్ ఓటుకు నోటు కేసులో లేరు**
**- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**



హైదరాబాద్,ఫిబ్రవరి21 తెలంగాణలో అరాచక శక్తులు రాజ్యమేలుతున్నాయని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ కీలక నేత హరీశ్ రావుపై కక్షగట్టి... నేర చరిత్ర ఉన్న చక్రధర్ అనే వ్యక్తితో పంజాగుట్ట పోలీస్ స్టేషన్ లో తప్పుడు కేసు పెట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్ రావు ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారని... కరోనా సమయంలో ఆరోగ్య మంత్రిగా ఎన్నో సేవలు అందించారని చెప్పారు. ఏదో ఒకటి చేసి హరీశ్ ను ఇరికించాలని చూస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. యాదాద్రిలో రేవంత్ రెడ్డి రుణమాఫీపై ఒట్టు పెట్టారని... ఆ మాట నిలుపుకోలేదని హరీశ్ రావు ప్రశ్నిస్తే అక్కడ కూడా కేసు పెట్టారని ప్రవీణ్ కుమార్ విమర్శించారు. ఎగవేతల రేవంత్ రెడ్డి అన్నందుకు మానకొండూరులో కేసు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నచిన్న అంశాల్లో కూడా హరీశ్ పై కేసులు నమోదు చేస్తున్నారని అన్నారు. రేవంత్ మాదిరి హరీశ్ ఓటుకు నోటు కేసులో లేరని చెప్పారు.పోలీసు ఉన్నతాధికారులు కూడా రేవంత్ అడుగులకు మడుగులొత్తుతున్నారని విమర్శించారు. తాను కూడా ఐపీఎస్ అధికారిగా పనిచేశానని...

